శివరాత్రికి ఆలయం ముస్తాబు

- 25 నుంచి మార్చి 1 వరకు ఉత్సవాలు
- అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం
- సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ


ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

పటాన్‌చెరు టౌన్: ప్రముఖ శైవక్షేత్రం బీరంగూడలోని భ్రమరాంబ మల్లికార్జున ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. కొండల మధ్యలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆలయం ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఐదు రోజుల పాటు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణ, రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం కనువిందు చేయనుంది. శివుడికి ఇష్టమైన మహాశివరాత్రి రోజున భక్తులు వేల సంఖ్యలో ఉపవాస దీక్షలతో ఇక్కడికి తరలివస్తారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రవీందర్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ నరేష్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు..
ఫిబ్రవరి 25 మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ ప్రథమ అర్చకులు ప్రహ్లాద తెలిపారు. ఐదు రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

పటాన్‌చెరు: భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ రవీందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఈఓ శశిధర్ గుప్తా, ఆర్ఐ శ్రీమన్, దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

క్యూలైన్‌లో వెళ్లి దర్శనం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తాం. భక్తులందరూ సహకరించాలి.


-ఆలయ ఈఓ శశిధర్

సీసీ కెమెరాల పర్యవేక్షణ

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారిని దర్శించుకునేలా చూస్తాం. పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే వాహనాలు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై ఆపకుండా పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.
-పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: మయూరినగర్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ రోడ్డు, మయూరినగర్ పార్క్, రత్నదీప్ వెనుకాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంజయ్యనగర్, వైట్‌ఫీల్డ్, రామాలయం టెంపుల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తడి,పొడి చెత్తపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ ఉద్యోగులు

రాయదుర్గం: తడిపొడి చెత్తపై మధురానగర్‌లో జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు వసతిగృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, దుకాణాలలో తడిపొడి చెత్తను వేరు చేసి జీహెచ్‌ఎంసీ ద్వారా చెత్త సేకరించే రిక్షా వారికి ఇవ్వాలని, మురుగుకాలువల్లో ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయరాదని శానిటేషన్ ఉద్యోగులు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రమేష్‌గౌడ్, శ్రీనివాస్, లడ్డూ, ఎస్‌ఆర్‌పి కిష్టప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ అనీల్‌కుమార్, తిమ్మప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్యామన్నకు అరుదైన అవకాశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ బీఆర్ శ్యామన్నకు అరుదైన అవకాశం లభించింది. శ్యామన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్‌ఐహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ) గవర్నింగ్ బోర్డు సభ్యుడుగా నియమితులయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డా ఈయనను నియమించారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి


ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి వినతి పత్రం అందజేస్తున్న ఆదిత్యనగర్ కాలనీ వాసులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి కాలనీ వాసులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, అసంపూర్తిగా మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానన్నారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాలనీ అధ్యక్షులు మహమ్మద్ ఖాసీం, ఉపాధ్యక్షులు లియకత్ పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న బీసీ కమిషన్ సభ్యులు

చందానగర్ : నల్లగండ్ల, లక్ష్మీవిహార్, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటి హాల్‌లలో గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో కులగణన సర్వే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ విభాగం ఉప దర్శకుడు బి.కేశరామ్, హాజరయ్యారు. కుల గణన సర్వే ప్రాముఖ్యత, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దీని ప్రభావం గురించి అవగాహన కల్పించామన్నారు.

పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ దరఖాస్తులకు చివరి తేదీ పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తు చివరి తేదీని పొడిగించినట్లు 'మనూ' అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. 'మనూ'లో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల ను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

రాజేంద్రనగర్‌కు ఉప ఎన్నిక తప్పదు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


విష్ణువర్ధన్‌రెడ్డికి నియామకపత్రం ఇస్తున్న సబితారెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి శాసనసభ ఉప ఎన్నిక తప్పదని, రాబోయే రోజుల్లో వచ్చే మున్సిపల్ ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నియామకమైన మంచిరేవుల గ్రామానికి చెందిన కె. విష్ణువర్ధన్‌రెడ్డికి గురువారం ఆమె నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందాల్సినంత అభివృద్ధి చెందలేక పోతుందన్నారు. మెట్రో ప్రాజెక్ట్‌తో రూపురేఖలు మారిపోయే అవకాశం ఉండగా దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయటంతో అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని, అప్పుడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో మరికొంత మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మణికొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ధన్‌రాజ్, ఉపాధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ, బాపుహిల్స్, వైఎస్సార్ కాలనీలల్లో లో వోల్టేజీతో సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. దిమ్మను నిర్మించాలని సూచించడంతో వారు సొంత డబ్బుతో నిర్మించటంతో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తమ విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఇరువురికి ఆయా కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కరించడంలో తాను ముందుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం సనత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా బల్కంపేట శ్మశానవాటిక సమీపంలో డీసీఎం వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని పలువురు వాహనదారులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి డీసీఎం పార్కింగ్ ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిలుపుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎస్సార్టీకాలనీలోని భగత్‌సింగ్ పార్కు వద్ద రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, ఆ పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే వెళ్లగా స్థానికులు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజ్ లైన్‌ను రీమోడలింగ్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురి అరెస్ట్

మాదాపూర్: గంజాయి సేవిస్తున్న ఐదుగురిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన మేరకు.. మాదాపూర్ చందానాయక్ తాండలోని జిఆర్‌సీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో గంజాయి సేవిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అపార్ట్‌మెంట్‌లోని పెంట్ హౌస్‌లో ఉన్న వారిని తనిఖీ చేయగా వెంకటేశ్, విజయరెడ్డి, రాహుల్, శివకుమార్‌లతో పాటు మరో యువతి ప్రియాంకను అదుపులోకి తీసుకున్నారు. యూరిన్, డగ్స్ స్క్రీన్ పరీక్షలు నిర్వహించగా వారు గంజాయి సేవించినట్టు తెలింది. వీరికి మత్తు పదార్థాలు విక్రయించిన వ్యక్తి ఇంటియజమాని రామచంద్రారెడ్డిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

సనత్‌నగర్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లు పల్లవి, ప్రసన్నలు సూచించారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఐక్యూఏసీ, పోలీస్ శిక్షణ కళాశాల (పీటీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండడం, దానికి అంతర్జాల సౌకర్యం ఉండడంతో వివిధ రకాల ఆఫర్లు అంటూ ఇబ్బడిముబ్బడిగా లింక్‌లు వచ్చి పడుతున్నాయని, ఆ లింక్‌లకు ఆకర్షితులై ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇచ్చిన వారమవుతామన్నారు. అపరిచిత వ్యక్తులు పంపించే లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండి వాటిని ఓపెన్ చేయకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే మహిళల భద్రత విషయంలో తెలంగాణ పోలీసు శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరుటౌన్: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని పటాన్‌చెరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్‌అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లు జీవిత ధ్రువీకరణ పత్రాన్ని నిర్ణీత గడువులోగా సమర్పించడంలో విఫలమైతే, సర్టిఫికెట్ స్వీకరించి, ప్రాసెస్ చేసే వరకు పెన్షన్ చెల్లింపులు నిలిపివేయడం జరుగుతుందన్నారు. పెన్షనర్లకు ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయానికి రావాలన్నారు.

ఎయిర్‌పోర్టుకు ప్రతి 50 నిమిషాలకు ఓ బస్సు

మియాపూర్: లింగంపల్లి నుండి ఆర్‌జీఐ ఎయిర్ పోర్టుకు ప్రతి 50 నిమిషాలకు ఏసీ పుష్పక్ బస్సులు నడుపుతున్నట్లు మియాపూర్ -2 డిపో మేనేజర్ వెంకటేశం తెలిపారు. మొదటి బస్సు ఉదయం 5.45 గంటలకు, చివరి బస్సు రాత్రి 8.45 గంటలకు ఉంటుందన్నారు. ఎయిర్ పోర్టు నుండి లింగంపల్లికి మొదటి బస్సు ఉదయం 7.30 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.30 గంటలకు ఉంటుందన్నారు.

'శ్రీమతి కథల సంపుటి' పుస్తకావిష్కరణ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'శ్రీమతి కథల సంపుటి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ రచయిత దొండపాటి కృష్ణ రచించిన ఈ పుస్తకాన్ని తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రిరాములు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ భూక్యాతిరుపతి, విల్సన్‌రావు కొమ్మవరపు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. గడ్డపోతారం మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి 300 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశంగౌడ్, భోజిరెడ్డి, నరసింహారెడ్డి, రమేష్, లింగం, నర్సింగరావు, మల్లేష్ పాల్గొన్నారు.

16వ రోజుకు చేరిన నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డుకు ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్యారానగర్, నల్లవల్లి, గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారంతో దీక్షలు 16వ రోజుకు చేరాయి. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డు ఏర్పాటు విరమిచ్చుకోవాలని లేనియెడల ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

మహిళల సమస్యలు పరిష్కరించండి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్


సద్వార్ హోమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

పటాన్‌చెరు టౌన్: సద్వార్ హోమ్‌లోని మహిళల సమస్యలను పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీరంగూడలోని స్వదార్ హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదార్ హోమ్‌లో ఎలాంటి సామాజిక, ఆర్థిక మద్దతు లేని మహిళలకు ఆశ్రయం ఆహారం, దుస్తులు, వైద్య చికిత్స, సంరక్షణ యొక్క ప్రాథమిక అవసరాలు తీర్చాలన్నారు. కేసులో ఉన్న మైనర్ బాలికలకు ఆశ్రయం ఉంటుందన్నారు. అనంతరం వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ఐఐసీకి భూపరిశీలన

ఆర్డీఓ రవీందర్‌రెడ్డి


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌లో గురువారం ఆర్డీఓ రవీందర్ రెడ్డి పర్యటించారు. సర్వే నంబర్ 27లోని ప్రభుత్వ భూములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పారిశ్రామికవేత్తలు టీఎస్ఐఐసీలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించాలని కోరిన నేపథ్యంలో ఆర్డీఓ గ్రామంలో పర్యటించి, భూముల రికార్డులను పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మనూ'లో కేంద్ర విద్యాశాఖ అధికారులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర విద్యాశాఖలోని జాతీయ భాష అమలు సమితి అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో జాతీయ భాష అమలును పరిశీలించారు. అనంతరం వారంతా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి జాతీయ భాష అమలుపై సమీక్షించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌తో సమావేశమయ్యారు.


కేంద్ర విద్యాశాఖ అధికారులతో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్



ఉత్సాహంగా క్రీడాపోటీలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అంతర్ వసతిగృహాల మధ్య ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ధ్యాన్‌చంద్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించారు. పోటీలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రారంభించగా ప్రొఫెసర్లు సిద్దిఖీమహ్మద్, సయ్యద్ అలీమ్ అష్రఫ్, ఎండీషాహిద్‌రజా, డాక్టర్ సమీనాబసు, ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇంద్రజిత్ గుప్తకు ఘన నివాళి




చందానగర్: కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం ఉత్తమ పార్లమెంటేరియన్, స్వాతంత్ర సమయోధులు ఇంద్రజిత్ గుప్త 24వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంద్రజిత్ గుప్త ఉత్తమ పార్లమెంటేరియన్, భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా, ఏఐటియూసి ప్రధాన కార్యదర్శిగా, భారతదేశ కార్మిక వర్గం కొరకు పీడితజన పక్షపాతిగా చివరి శ్వాస వరకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ చెన్నకేశవ రావు, సీఆర్ పాలి క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజిని పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై సెమినార్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్)సంస్థలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అమలు, ఇందులో ఉన్న సవాళ్లు, చేర్చాల్సిన పనుల గురించి రెండ్రోజుల సెమినార్ ఏర్పాటు చేశారు. దేశంలోని పలు ప్రాంతాల ఉపాధి హామీ రీసర్చ్ ఫెలో పాల్గొన్నారు. జీవనోపాధి అభ్యాసకులు, వాతావరణ స్థితిస్థాపకల, డిజిటల్ పాలన నైపుణ్యాభివృద్ధి, లింగ సమానత్వం, ఎస్‌డీజీలపై సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ మాట్లాడారు. గతం, వర్తమానం, భవిష్యత్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) పని తీరుపై చర్చించారు.అనంతరం ఉపాధి హామీ పథకం సవాళ్లపై రాసిన పుస్తకాని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, ఎస్ గవలి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ సోనల్ మోబర్ రాయ్, డాక్టర్ సీ ధీరజ్ ,డాక్టర్ దిగంబర్ ఎ చిమాన్‌కర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



మణికొండ: వేగంగా దూసుకొచ్చిన ట్రావెల్స్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అజీజ్‌నగర్ నుంచి లంగర్‌హౌస్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న బి.రాజు యాదవ్‌ను వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో కిందపడి గాయపడ్డాడు. బస్సు ఆపకుండా టిప్పుఖాన్ పూల్ వద్ద ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. డ్రైవర్ రాజును స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇవ్వగా మద్యం తాగినట్టు గుర్తించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్
- కార్వాన్ నియోజకవర్గంలో కులగణన సర్వే పరిశీలన

గోల్కొండ: బీసీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పర్‌బస్తీ, ఆర్యసమాజ్, టోలి మసీదు, బాంజావాడి తదితర ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను అడిగి నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధృడ సంకల్పంతో ఉన్నారన్నారు. సంవత్సర కాలం నుంచి బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే పూర్తయిన కులగణన సర్వేను మళ్లీ చేయించడం ఆయన ధృడచిత్తానికి నిదర్శనమని అన్నారు. కులగణన పూర్తి చేయడం కోసం ముఖ్యమంత్రి ఎన్నికలను సైతం వాయిదా వేశారని పేర్కొన్నారు.

బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదు..
బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదని ఆయన అన్నారు. సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ప్రజా సంక్షేమం బాగా తెలుసన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులను ఆయన కలిశారు. ప్రభుత్వం నుంచి మీకు ఆసరా ఫించన్‌లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, జి.కిషన్, ప్రేమ్‌కిషోర్, వనజ, షకీలా, హేమలత తదితరులున్నారు.